## కథ

# మధురస్మృతి

గుండె ఝల్లుమంది.

చిత్రమైన పరిస్థితి.

ఇలాంటి పరిస్థితి ఇంకో అమ్మాయికైనా కలుగుతుందా?

ఎలా వెళ్లను? అయినా వెళ్లాలి.

ఇంటి దగ్గర తెలిస్తే? తెలిస్తే గిలిస్తే ఇంకేమైనా వుందా? నానా రకాలుగా అనుకోరూ!

భయం మొదలైంది.

బుక్స్ గట్టిగా బిగించుకుని చుట్టూ చేతులు కట్టుకున్నాను.

మబ్బుల చాటునుండి సూర్యుడు ఒకటే పనిగా దోబూచులాడుతున్నాడు. చల్లటిగాలి ముఖాన్ని తాకుతోంది.

మనసులో తెలీని భావం! కూసింత డిస్టర్బ్ కాగానే తెట్టె వీడి చుట్టూ ముసిరిన తేనెటీగల్లా మస్తిష్కంలో ఆలోచన్ల ముసుర్లు.

లోలోపల ఆత్రుత, భయం, అనుమానం, సిగ్గు...ఇవేవీ బయట పడనీకుండా ఒక్కో అడుగు వేస్తూ నెమ్మది నెమ్మదిగా నిశ్శబ్దంగా నడుస్తున్నాను.

నావెంటే అతను!

★★★

ఫోర్త్ క్లాస్ రూమ్.

పీరియడ్ మారబోతున్న టీచర్ క్లాసందర్లోను వెనుక బడ్డ ఓ మొద్దు స్టూడెంట్ని పిలిచి ఏవైనా మూడు ఇంగ్లీష్ మాటలు రాసుకురమ్మని మరురోజుకి హోమ్ వర్క్ ఇచ్చింది.

రాసి తీస్కెళ్లకపోతే టీచర్ కొడుతుందనుకున్న స్టూడెంట్ ఇంటికొచ్చాక అయోమయంలో పడ్డాడు. డాడీని అడుగుదామని దగ్గరికి వెళ్లాడు. అప్పుడే ఆఫీస్ నుండి వచ్చి ఓపిక నశించిన అతని డాడీ 'షటప్' అన్నాడు. అది ఇంగ్లీషు మాటే కదాని నోట్ చేసుకున్నాడు స్టూడెంట్.

తర్వాత ఓ సందర్భంలో అతని డాడీ మమ్మీని 'హలో డార్లింగ్' అనడం పొంచి విని రెండో మాటగా దాన్ని నోట్ చేసుకున్నాడు. ఇక మూడో మాట కోసం ఎదురు చూస్తుండగా ఆ ఇంట్లో అందరూ టీవీలో క్రికెట్ చూడ్డం మొదలుపెట్టారు. క్రికెట్ మంచి టెన్షన్ మీదుంది. అప్పుడే సచిన్ ఓ సిక్సర్ కొట్టడంతో 'లొల్లీ షాట్' అని అరిచాడు స్టూడెంట్ డాడీ.

ఆ పుణ్యాన మూడో మాట కూడా దొరకడంతో అతడి ప్రాబ్లమ్ సాల్వ్ అయింది.

మరుసట్రోజు క్లాస్‌రూమ్‌లో...

''ఏరా! మూడు ఇంగ్లీషు పదాలు రాసుకొచ్చావా?'' అనడిగింది టీచర్.

''ఓ..రాసాను టీచర్'' బుద్ధిగా చెప్పాడు స్టూడెంట్.

''లేచి విన్పించు'' అంది టీచర్.

స్టూడెంట్ వినయంగా లేచి చేతులు కట్టుకుని ''షటప్'' అన్నాడు.

''వెధవా! అదేం మాటరా!'' విస్మయంగా అంది.

''హలో డార్లింగ్.''

అది విని ఇక శృతి మించుపోయిందనుకున్న టీచర్ లాగి గూబమీద ఒకటిచ్చింది.

''లొల్లీ షాట్'' బిగ్గరగా అరిచాడు స్టూడెంట్.

చెప్పడం ముగించింది కమల.

అందరితోపాటు నేనూ పొట్టచెక్కలయ్యేలా నవ్వాను.

కమల జోక్స్ చెప్పడంలో దిట్ట.

ఇంకో జోక్ చెప్తానంటూ ముందుకొచ్చింది. ఆ తర్వాత షీలా, జ్యోతి, మాల.

అసలు దారిన నడిచినట్టే లేదు. బాగా ఎంజాయ్ చేస్తున్నాం. ప్రతిరోజూ వర్షం కురిసి ఊరికి బస్సుల్లేకపోతే ఇలాగే కిలోమీటర్ల లెక్క నడుస్తూ కాలేజీ నుంచి ఇంటికి చేరుకోవడం చాలా బావుంటుంది.

మాకు కొద్దిదూరంలో ముందు వెళ్ళే జంట్స్ గ్యాంగ్ కూడా ఆటపాటలతో బాగా ఎంజాయ్ చేస్తున్నారు.

ఎంత దూరమెంత దూరమెంత దూరం! ఈ ఎంజాయ్‌మెంటంతా ఇంకొద్ది దూరం మాత్రమే. పాలెం దగ్గర ఎటువాళ్లటు చీలిపోతారు. ఆ తర్వాత...

''ఒక్కదానివే ఎలా వెళ్తావే?'' అంది షీలా.

''ఎలా వెళ్ళేదేంటి? ముందెళ్ళే గ్యాంగ్‌లో సతీష్ అదే ఊరుగా'' రాణి నొక్కి గుర్తు చేసింది.

నిజంగా సతీష్ పేరెత్తడంతోనే కలిగింది భయం.

పాలెం నుంచి దాదాపు ఏడు కిలోమీటర్లు...పురుగు పుట్ట తప్ప కనిపించని పొలాల్లో ఒంటరొంటరిగా అతడు నేను కలిసి ప్రయాణం.

ఆ విషయం తలచుకుంటేనే గుండె ఝల్లుమంది.

★★★

అతడికి ముందు నడవటంకంటే వెనుకే నడిస్తే బావుండునని వుంది. నన్ను చూసి అతను స్లో అవుతున్నాడు తప్ప ముందుకు రావడంలేదు.

ఏం చేస్తున్నాడో?

నేను కట్టుకున్నది ఎర్ర ఓణీ, ఆకుపచ్చ లంగా, జాకెట్. అమ్మ ఉదయాన జడ బిగుతుగా కట్టింది. నా జుత్తు ఒత్తుగా వుంటుంది కాబట్టి వెంట్రుకలు లేగి వుండవు.

మగవాళ్ళు పాదాలవంక కూడా పట్టి పట్టి చూస్తారట. వణుకుగా వుంది. కాళ్ళు మడత పడతాయేమో! కింద పడతానేమో!

కొద్ది దూరం వెళ్లాక ఆ భయం కాస్త పోయింది.

సతీష్ పక్కనే నడుస్తున్నాడు. నావంక చూడ్డంలేదు. నిశ్శబ్దంగా నడుస్తున్నాడు.

నన్ను నడిపిస్తున్నాడు.

డొంక రోడ్డు ఆగిపోయింది.

సన్నటి దారి...

గాలికి ఆరీ ఆరక కొద్దిగా గట్టిపడ్డ నేల, అక్కడక్కడ బురద...

ఇంకో చేత్తో చెప్పులు కూడా పట్టుకోవాల్సి వచ్చింది.

అతను ముందు, నేను వెనుక!

ఇప్పుడు బావుంది. హాయిగా నడవగలుగుతున్నాను.

అతగాడు తప్పటడుగులు వేస్తే నాకేం, జారిపడితే నాకేం? పడితే! పడితే..నవ్వాలని వుంది.

అల్లరి ఆలోచన.

మొక్కలు మోకాళ్ల ఎత్తు పెరిగి పొలాలు పచ్చగా కనిపిస్తున్నాయి.

గాలి తిమ్మెరలు తెరలు తెరలుగా మొక్కలమీదికి వాలి పరవశం చెందుతున్నాయి. చెట్లు పులకించి పోతున్నాయి.

చెట్ల ఆకులు మురిపెంగా కదుల్తూ ఆకాశంలో ఎగిరే పక్షులని విష్ చేస్తున్నాయి.

ఎంత అందమైన అనుభూతి, కాలం తెలీడంలేదు.

బ్రిడ్జికి దగ్గర పడ్డాం.

బాగా డౌన్‌లో వుండడంతో మీదుగా నీరు...మోకాళ్ల లోతు వరద నీరు జోరుగా ప్రవహిస్తోంది.

దాన్ని దాటడమే ప్రమాదంతో కూడుకున్న పని.

నడుస్తూ నడుస్తూ కొద్దిగా కాలు పైకి ఎత్తామంటే సరి. నీటి ఫోర్స్‌కి ఆ వైపు పెద్ద సుడిగుండంలోకి కొట్టుకుపోవడమే.

ఏటా నడిచే అలవాటున్నా మనసులో భయం వీడడంలేదు.

ఇప్పుడెలా పోవడం?

అతను మాట్లాడకుండానే నా చేతిలో బుక్స్ తీసుకున్నాడు. ఓ చేత్తో నా నడుం చుట్టూ చేయి వేస్తూ గట్టిగా పట్టుకున్నాడు.

కలే నిజమై కల'వరమే' అయింది.

కాలి కింద నీళ్ళు...పక్కన అతడు.

కష్టపడి గట్టెక్కాము.

మళ్లీ డొంకరోడ్డు.

ఇంకొద్ది దూరమే. నా బుక్స్ నేను చేతిలోకి తీసుకున్నాను.

అతను పక్కనే నడుస్తున్నాడు.

నీళ్లల్లో చెయ్యి పట్టుకుని హెల్ప్ చేశాడుగా! పెద్ద హీరోలా ఫోజు పెట్టి 'ఐ లైక్ యూ' అంటాడేమో. అలా అంటే మరి నేనేమనాలి?

ఏం మాట్లాడడేం? అసలు నేనంటే ఇష్టం ఉన్నదా లేదా? ఏదోకటి తేలిపోవాల్సిందే?

అతను గుంభనంగా నిష్కపటంగా ఏమీ ఎరుగని వాడిలా (చెయ్యి తాకినాగానీ) నిండుగా నడుస్తున్నాడు.

ఏం అంత ఖర్మేమిటి? ఏదైనా చిలిపి మాటలు, జిలిబిలి కబుర్లు, కవ్వింపు చేష్టలు చేస్తే నేనేమంటాను?

ఎందుకలా ప్రవర్తించడు? ఆడవాళ్లంటే భయమా? మొన్న మొన్నటిదాకా ఇష్టం వచ్చినట్టు మాట్లాడేవాడు. మగాడు అయి వుండి ఒక్కసారే అంతగా ఎందుకు మారిపోవడం?

ప్రశ్నలు... ప్రశ్నలు...!



★★★

''మొత్తానికి ఏడడుగులు వెయ్యాల్సిన మొగుడితో పెళ్లి కాకుండానే ఏడు కిలోమీటర్లు నడిచావన్నమాట!''

ఇంటికొచ్చాక సతీష్‌తో కలిసొచ్చిన విషయం అమ్మతో చెప్తుండగా విన్న పిన్ని కవ్వింపుగా అంది.

నేను సిగ్గుతో కుంచించుకుపోయాను.

ఆ ఇంట్లో, ఈ ఇంట్లో పెద్దల నిర్ణయానుసారం సతీష్‌కి, నాకు రెండ్రోజుల క్రితమే పెళ్లి నిర్ణయం జరిగింది.

కాకపోతే పెళ్లి మాత్రం మా పరీక్షలు పూర్తయ్యాక!

అనుకున్న ప్రకారం నిశ్చయ తాంబూలాలు ఇచ్చి పుచ్చుకున్నారు. ఫ్రెండ్స్‌కి ఈ సంగతి తెలిసి మొదట ఆశ్చర్యపోయారు.

''కొంపదీసి లవ్ ఎఫైర్ కాదుకదా!'' అన్నారు.

''లేదు. పెద్దల నిర్ణయమే'' అన్నాను.

అందరి ఆశీస్సులతో ఆర్నెల్ల అనంతరం మా పెళ్లి జరిగింది.

★★★

''మీ జీవితంలో మర్చిపోలేని ఓ మధురస్మృతి చెప్పరూ'' అడిగాను ఏమీ తోచక సతీష్‌ని.

అతను చప్పున పక్కమీద నుంచి లేచి లోపలికెళ్లి డైరీతోపాటు వచ్చాడు.

అందులో ఓ పేజీని నా కళ్లముందు వుంచాడు.

''స్వరూపకి నాకు పెళ్లి విషయం తెలిసాక ఆమెతో ఒంటరిగా ఇంటివరకు నడిచి రావడం ఇదే ప్రథమం.

ఆమె వెనుకే నేను నడవడం భలేగా వుంది. ఒంకులు తిరిగిన ఆ జుత్తు, చక్కని వాలుజడ, నడకలో వయ్యారంగా కదిలే నడుము, అన్నిటినీ మించి ఎర్రటి ఓణీలో దాచిన ఆమె పసిమిమేని...నన్ను చూపు మరల్చనివ్వడంలేదు. తప్పు చేస్తున్న ఫీలింగ్! తమాయించుకున్నాను.

పాదాలవంకే చూపులు. బ్రిడ్జి దగ్గర ఆమె చెయ్యి పట్టుకోవడానికి జంకాను.

ఏమనుకుంటుందో? భయం! ఏమైనా అనుకోనీ తను ఏ ఆధారం లేకుండా ఇంత ప్రవాహంలో ఎలా నడవగలదు? నేనేగా ఇక నుంచి ఆమెకు తోడు.

ఆమె చెయ్యి పట్టుకుని నడిపిస్తుంటే అంబరాన్ని చుంబించిన అనుభవం, అన్నీ గెలిచిన ఆనందం.

'ఐ లవ్ యూ' పెదవులదాకా వచ్చింది. ఏమనుకుంటుందో? నవ్వుతుందేమో? పక్కన నడిచే ఈ స్వరూప నా జీవన జ్యోతవుతుందని కలగన్నానా? ఆమెతో మౌనంగా గడిపే ఈ క్షణమే ఒక జీవితానికి ఊపిరి. ఈ వింతైన అనుభూతిని నాతోపాటు ఆమె పంచుకునేలా చేసేదెలా?''

అతడు ఇప్పుడు మా ఆయనగా నా కళ్లల్లోకి చూస్తున్నాడు. అధికార దర్పాలేవీ లేవు.

ఎప్పటిలానే నిష్కపటంగా...అతడి దగ్గరగా జరిగాను. గుండె ఝల్లుమనలేదు.

బ్రిడ్జి మీద నీళ్లల్లో నడుస్తున్న ఫీలింగ్. కాలు జారుతుందేమో! జారుతోంది...జారుతోంది. నాతోపాటు అతనిదీనూ. అదే మధురం!

★

పావులూరి శివాజీ